క్లుప్తంగా

పోర్టు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఎంవీపీ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దేవీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, డాక్టర్ టీఎస్ దీప్తి ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులకు అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ కన్వీనర్ ఎం.ఎస్.ఎస్.ఎస్. సింగ్ పర్యవేక్షించారు.

15 నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ బజార్ పేరుతో చేనేత హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ సంయుక్త కార్యదర్శి రేణుకా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళాఖండాలు, స్కోల్ అండ్ మార్బల్ గులక రాళ్లు, చేతితో అత్యంత కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతుల్లో తాటాకు బుట్టలు, బంజార సూది వర్క్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



సాగర తీరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, నగర యువత పాల్గొన్నారు. గ్లకోమా అనేది కంటిపై ఒత్తిడి పెరుగుదలతో వచ్చిన సమస్య అని, ఇది కోలుకోలేని అంధత్వానికి దారితీస్తుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

ఎంవీపీ కాలనీ: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఎంవీపీ కాలనీ సెక్టార్-3లో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో భాగంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల గురించి తెలియజేయడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు త్రినాధరావు, శ్రీనివాస్, సన్యాసి, అంకమ్మ, బంగారుతల్లి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు వేళాయె

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రం తోటగరువు హైస్కూల్‌లో గదులకు రాసిన పోలింగ్ బూత్ నంబర్లు



చార్టులు, బ్యాలెట్ బాక్సులతో కేంద్రానికి చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది

ఆరిలోవ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తూర్పు నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కోసం కేటాయించిన కేంద్రాలను సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రానికే పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచే పోలీస్ బందోబస్తు నిర్వహిస్తుండడంతో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల్లో బూత్‌లు ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటర్ల కోసం గదుల వద్ద బూత్‌ల నంబర్లతో కూడిన చార్టులు పెట్టారు. ఏయే బూత్‌లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో తెలుపుతూ ముందుగా ఓ బోర్డు ఏర్పాటు చేశారు. విశాఖ రూరల్, అర్బన్ రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్‌లలో వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రితో పోలీస్ బందోబస్తు మధ్య కేంద్రాలకు చేరుకొన్నారు.

23,412 మంది ఓటర్లు.. 9 కేంద్రాలు

నియోజకవర్గం పరిధిలో 23,412 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. వీరి కోసం నియోజకవర్గం పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆరిలోవలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విశాలాక్షినగర్ ఓటర్లు కోసం సాగర్‌నగర్, ఎంవీపీ కాలనీలో రెండు ప్రాంతాలు, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఏయూ ఉన్నత పాఠశాల, కృష్ణా కళాశాల, రేసపువానిపాలెం, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఆయా కేంద్రాలలో 25 బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లలో 13,144 మంది పురుషులు కాగా, 10,264 మంది మహిళా పట్టభద్రులున్నారు. వారితో పాటు మరో నలుగురు ఇతర ఓటర్లున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకో వచ్చని అధికారులు తెలిపారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ దరి కనకమహాలక్ష్మీనగర్‌లో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఉదయం నుంచి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. కనకమహాలక్ష్మీనగర్, ఆపరేషన్ కాలనీ, జైభీం నగర్, నలభై గజాలు కాలనీ, దుర్గాబజార్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్.ఎస్.కె.మహంతి, అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: సినీ సంగీత దర్శకుడు కేవీ మహదేవన్ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మా, సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు హైకోర్టు న్యాయవాది, ఆయా సంస్థల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి తెలిపారు. ఆదివారం రామ్‌నగర్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్‌తో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మహంతి మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా కళా రంగానికి తనగాన మాధుర్యంతో అలరిస్తున్న జామి శివ అప్పలరాజుకు స్వర కళా పురస్కారం అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. 14న సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కేవీ మహదేవన్ స్వరపరచిన చిత్ర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారుల గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఘంటసాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

అరకు అందాలు మైమరిపిస్తాయి..

- ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- నేషనల్ గ్రూప్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో చిత్రాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: అరకు అందాలను నేరుగా చూసినా, చిత్రాల్లో చూసినా మనస్సును మైమరిపిస్తాయిని తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఏర్పాటు చేసిన నేషనల్ గ్రూప్ షో ద్వారా తెలిసిందని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో నేషనల్ గ్రూప్ షో పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా బంధించి రాబోయే తరాలకు అందించాలన్నారు. చిత్రలేఖనం అంత సులభం కాదన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రాలు మనస్సును హత్తుకుంటున్నాయన్నారు. నగరవాసులు ఈ ప్రదర్శనను సందర్శించి గిరిజన జీవన శైలిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ డి.సింహాచలం, ఎస్.శ్రీనివాస్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

20 మందికి 'విటమిన్-డీ' పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి అసోసియేషన్ భవనంలో అపోలో డయాగ్నోస్టిక్ సిబ్బంది ఆదివారం 'విటమిన్-డీ' పరీక్షలు చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఉచితంగా బీపీ, మధుమేహ పరీక్షలతో పాటు మహిళలకు రూ.1850 విలువ చేసే విటమిన్-డీ పరీక్షలు రూ.199కు చేశారు. దీంతో 20 మంది స్థానిక మహిళలు ఈ అవకాశం వినియోగించుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. ఈ శిబిరంలో 70 మందికి ఉచితంగా బీపీ, మధుమేహ పరీక్షలు చేసినట్టు ఆయన తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



అక్కరమానికి కేక్ తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



11వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకుడు గొలగాని

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని తూర్పు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్ల సమక్షంలో అక్కరమాని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందజేసి వెనకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండాను 15వ వార్డులో ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు



పాపయమ్మకు సాయం అందిస్తున్న పీతల గోవింద్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని తూర్పు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతం 13వ వార్డు కార్యాలయంలో పార్టీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ స్థాపించనప్పటి నుంచి ఇప్పటి వరకు కార్యకర్తలు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడేవారిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాన మోహనరావు, జహంగీర్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలేనికి చెందిన పాపయమ్మ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రూ.25 వేలు సహాయాన్ని అందించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు, పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పాపయమ్మకు పార్టీ కార్యకర్తల సహకారంతో గోవింద్ ఆర్థిక సహాయం చేశారు.

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కర్రి శ్రీనివాస్, ఎస్సీసెల్ నాయకులు కణితి మరియదాసు, పెద్దిరెడ్ల నూకరాజు, వేలంగణి, రాజేష్, నడింపల్లి రాజశేఖర్, కాళ్ల లత పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు




దీక్షా శిబిరంలో పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన విశాఖ ఉక్కుపై కేంద్ర, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలుగువారికి అభ్యంతరాన్ని కలిగిస్తున్నాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ దీక్షలు ఆదివారం నాటికి 459వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు మొండా తొడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య నేతృత్వంలో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ పోరాట యోధుల ప్రాణ త్యాగాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తే సహించేదిలేదన్నారు. దళితులు, బలహీనన వర్గాలు,పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయని, త్వరలోనే ప్రధానిని కలిసి అభ్యంతరం తెలుపుతామన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, కొత్త సత్యానారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, హెచ్ఎస్ఎల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ అనిల్‌కుమార్, కొండలరావు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి
- రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగులు, అధికారుల కోసం వాల్తేర్ డివిజన్ ఆదివారం దొండపర్తిలోని రైల్వే హాస్పిటల్‌లో న్యూరో, కార్డియాలజీ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో రైల్వే ఆస్పత్రి వైద్యుల బృందం సేవలందించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. వ్యక్తిగత ఆరోగ్యం, పోషణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి రైల్వే ఉద్యోగి, సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు. నిర్దేశిత సమయాల్లో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అధికారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వారికి నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం చెప్పారు. మెడికల్ క్యాంప్‌లో సుమారు 57 మంది అధికారులు, 3 కుటుంబాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా.. వీరిలో కొత్తగా నలుగురు హైపర్ టెన్షన్‌తో, ఇద్దరు డయాబెటిస్ మెల్లిటస్‌తో, ఇద్దరు ఇస్కెమిక్ హార్ట్ డిసీజస్‌తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. వీరిలో అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించనున్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు.

+ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం గాజువాక జోగవానిపాలెంకు చెందిన బోను సూర్యనారాయణ (74) ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రైలు పట్టాలు దాటుకుంటూ ఫార్మా సిటీ కాలనీ వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో అనకాపల్లి నుంచి దువ్వాడ వైపు వస్తున్న గూడ్స్ రైలు అతన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లోకో పైలెట్ సమాచారం మేరకు దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుని సమాచారం తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

డ్వాక్రా స్టాళ్లలో మహిళలే విక్రయించాలి

సీతంపేట: డ్వాక్రా స్టాళ్లలో మహిళలే విక్రయించాలని, సహాయకులుగా మహిళలనే నియమించుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్ అన్నారు. ఆదివారం ఉదయం నరసింహనగర్ రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బజారులోని స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఎవరికి కేటాయించిన స్టాల్‌లో వారే విక్రయిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ధరల పట్టిక ప్రకారం విక్రయాలు జరిగేలా చూడాలని సిబ్బందిని యాసిన్ ఆదేశించారు. రైతుబజార్ ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కీటకాహార మొక్కలు



కీటకాలను ఆహారంగా తీసుకునే మొక్క

ఏయూ క్యాంపస్: కీటకాహార మొక్క పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో కనువిందు చేస్తోంది. ఒక మొక్క పదికిపైగా ప్రత్యేకమైన సంచులతో వృక్షశాస్త్ర పరిశోధకులు, విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ట్రయాంగులరిస్‌గా వ్యవహరించే ఈ చెట్టు ఆకు మధ్య ఈనె ఒక తిత్తిగా మారిపోతుంది. తిత్తె చుట్టూ మకరందం వంటిది ఏర్పడుతుంది. ఇది కీటకాలను ఆకర్షిస్తుంది. అందమైన రంగులతో కనిపించే ఈ తిత్తెను చూసి కీటకాలు దీనికి ఆకర్షితమవుతాయి. దీనిని తాకిన వెంటనే కీటకాలు ఆ తిత్తెవంటి సంచిలోకి జారిపోతాయి. వీటిని ఆహారంగా మార్చుకుని జీర్ణంచేసుకునే లక్షణం కలిగి ఉండటం దీని ప్రత్యేకత. కీటకాలను అరగించి, జీర్ణం చేసుకుంటుంది. ఈ మొక్కలను ప్రత్యేక పరిస్థితుల్లో పెంచుతారు. వీటికి నేరుగా ఎండ తలగకూడదు. నీడనిచ్చే ప్రాంతాలలో కుండీలలో వీటిని పెంచుతారు. దీనికి ప్రత్యేకంగా ఆర్ఓ వాటర్, సహజ సిద్ధమైన వర్షపు నీటిని మాత్రమే వినియోగించాలి. మేఘాలయలో దట్టమైన అటవీ ప్రాంతాలలో ఇవి కనిపిస్తాయని జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. నెపెంథిస్ జాతికి చెందిన మొక్కలుగా వీటిని వ్యవహరిస్తారు.

'బుల్లయ్య' విద్యార్థుల బీచ్ క్లీన్



బీచ్‌క్లీన్‌లో పాల్గొన్న బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థులు

దాబాగార్డెన్స్: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థులు ఆదివారం బీచ్ క్లీన్ కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఉమా డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉమాశంకర్, చిరివేళ్ల సాయి మహంతీర్, స్వచ్ఛంద సేవకుడు భార్గవ్ వంశీ, బొండా ప్రియాంక, ద్వారపురెడ్డి పావని, ప్రసన్న, పూజిత, మెట్ల నాగరాజు, కె. బారన్, వీరబాబు, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఈత పోటీలు



ఈత పోటీలను ప్రారంభిస్తున్న వరప్రసాద్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు లోని స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ఈత పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు పోటీపడ్డారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు, డెకథ్లాన్ స్పోర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 106 మంది పాల్గొనగా.. వీరిలో 62 మంది చిన్నారు లు ఉన్నారు. వయసుల వారీగా పోటీలు జరిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి సనపల వరప్రసాద్, భారత వాయు సేన రిటైర్డ్ వారంట్ ఆఫీసర్ వాకర్ సోమనాథ్ సాహూ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్క్ కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షులు బోయపాటి శ్రీనివాస్, శాంత భూషణ్, కోశాధికారి కె.కుర్మారావు, కె.సురేష్, సంయుక్త కార్యదర్శి బి.త్రినాథ స్వామి, కార్యవర్గ సభ్యులు మళ్ల రామకృష్ణ, పల్లా చంద్రమౌళి, కనకరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.